సాక్షి వరంగల్

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



జల విలయానికి ఏడాది..

గతేడాది ఆగస్టు 31 అర్ధరాత్రి, సెప్టెంబర్ 1న తెల్లవారుజామున ఎడతెరిపి లేకుండా కుండపోతగా కురిసిన భారీ వర్షానికి వరదలు ముంచెత్తాయి. - 8లో▸



'భీమునిపాదం'లో సందడి

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపం భీమునిపాదం జలపాతంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29^0 /25^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

న్యూశాయంపేట: ప్రజల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో సోమవారం(నేడు) ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్య శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వాలని తెలిపారు.

గ్రేటర్‌లో..

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ)లో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కమిషనరేట్ పరిధిలో 6,683 గణేశ్ విగ్రహాలు

వరంల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 6,683 గణపతి విగ్రహాలు పూజలందుకుంటున్నాయని కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఇందులో సెంట్రల్ జోన్ పరిధిలో 2,675, ఈస్ట్‌జోన్ పరిధిలో 2,043, వెస్ట్‌జోన్ పరిధిలో 1,965 విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రులు కొనసాగుతున్నాయని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని గణపతి మండపాలను సందర్శించడంతోపాటు నిర్వాహకులు ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది మొత్తం 6,354పైగా విగ్రహాలను జియో ట్యాగింగ్ చేసినట్లు తెలిపారు. మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీసుల సూచనలను పాటిస్తూ నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు.

నేటి నుంచి బియ్యం పంపిణీ

ఖిలా వరంగల్: కొత్తకార్డులకు సన్నబియ్యం పంపిణీకి వరంగల్ జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. మూడు నెలల విరామం తర్వాత రేషన్ షాపులు సోమవారం తెరుచుకోనున్నాయి. జిల్లాలోని ఏనుమాముల, నర్సంపేట, వర్ధన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్‌షాపులకు సన్నబియ్యం చేరుకున్నాయి. కొత్త కార్డుల పంపిణీకి ముందు ప్రతి నెలా సుమారు 509 షాపుల ద్వారా 2,66,429 మంది లబ్ధిదారులకు 50.14.541 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేసేవారు. పెరిగిన లబ్ధిదారులకు అనుగుణంగా అదనంగా జిల్లాకు 53,82,518 టన్నుల స్టాక్ కేటాయించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లిలో శిథిలావస్థలో ఉన్న పురాతన అంజనేయ స్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపినట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలు జరిపినట్లు ఆధారాలు కనబడడంతో స్థానికులు తీవ్ర ఆశ్చర్యానికి లోనైయ్యారు. పోలీసులు చర్యలు తీసుకొని తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి శిక్షించాలని గ్రామస్తులను కోరుతున్నారు.

టీజీ ఎస్పీ కమాండెంట్ ఉద్యోగ విరమణ



ఖిలా వరంగల్: మామునూరు టీజీ ఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ బి.రాంప్రకాశ్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో డి.శివప్రసాద్‌రెడ్డి కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగ విరమణ చేసిన రాంప్రకాశ్, దంపతులను అధికారులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏసీ కృష్ణప్రసాద్, శ్రీనివాస్ రావు, వీరన్న, ఆర్‌ఐలు విజయ్, కార్తీక్, రాజిరెడ్డి, రవి, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో అమృతవర్షిణికి బంగారు పతకం

వరంగల్ స్పోర్ట్స్: కేఎల్‌బీ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎదులాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రెండో తెలంగాణ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో దుర్గావర్జుల అమృతవర్షిణి ప్రతిభ కనబరిచింది. పూంసే విభాగంలో బంగారు, కొరుగి విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. అమృతవర్షిణి వడ్డేపల్లి పరిమళ కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. ఆమె తండ్రి సంతోష్‌కుమార్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలక్ట్రిసిటీ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నారు.

స్వచ్ఛ ఏవమ్ హరిత్

పాఠశాలల్లో పలు అంశాలకు రేటింగ్

- పచ్చదనం, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల వివరాలు ఎస్‌హెచ్‌వీఆర్ యాప్‌లో నమోదు
- సెప్టెంబర్ 30 గడువు
- జాతీయ స్థాయిలో ఎంపికైతే ఒక్కో పాఠశాలకు రూ.లక్ష ప్రోత్సాహకం



హనుమకొండలో నిర్వహించిన ఎంఈఓల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజింగ్ కో-ఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

విద్యారణ్యపురి: దేశంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత తదితర అంశాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ్ రేటింగ్స్ (ఎస్‌హెచ్‌వీఆర్) ఇవ్వనుంది. ఇందుకోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్వచ్ఛ ఏవమ్ విద్యాలయ్ 2025-26 రేటింగ్స్ యాప్‌ను ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని సెప్టెంబర్ 30లోగా వివరాలు పంపించాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకులాల ప్రధానోపాధ్యాయులు స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ్ రేటింగ్స్ కోసం వివరాలు పంపించాలని జిల్లాల విద్యాశాఖ అధికారులు సూచించారు. అలాగే, ఆయా అంశాలకు అనుగుణంగా పాఠశాలలను స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయాలుగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు హనుమకొండ జిల్లాలోని 14 మంది ఎంఈఓలు, స్ట్రాంగ్ టీచర్లకు స్వచ్ఛ ఏవమ్ శిక్షణపై ఇచ్చారు.

ఎస్‌హెచ్‌వీఆర్ లక్ష్యాలు..

పాఠశాలల్లో పరిశుభ్రత, పచ్చదనం, బాలల స్నేహపూరిత వాతావరణం పెంపొందించడం, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం, వినియోగం, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండడం, విద్యార్థులు సమీకృతంగా పాఠశాల, పచ్చదనం, పరిశుభ్రత గురించి సమాజంలో మార్పునకు విద్యార్థులే రాయబారులుగా ఉండడం.

జిల్లా స్థాయిలో ఎంపిక..

జిల్లా స్థాయిలో ప్రధానోపాధ్యాయులు పొందుపర్చిన సమాచారం మేరకు స్టార్ రేటింగ్ ప్రకారం కలెక్టర్, డీఈఓ, వైద్యాధికారి, ఇంజనీరింగ్ అధికారి, స్వచ్ఛంద సంస్థ, ముగ్గురు ఉపాధ్యాయులతో కూడిన కమిటీ ఎంపిక చేస్తుంది. మూడు లేదా అంతకంటే ఎక్కువ స్టార్ రేటింగ్ ఉన్న ఆరు గ్రామీణ పాఠశాలలు, రెండు పట్టణ ప్రాంతాల్లో ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతారు.

రాష్ట్రస్థాయిలో..

రాష్ట్ర విద్యాశాఖ, వైద్యశాఖ, పంచాయతీరాజ్, స్థానిక సంస్థల సంచాలకులతో స్వచ్ఛంద సంస్థ, ఇద్దరు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో కూడిన కమిటీ ఎంపిక చేస్తుంది. 4 స్టార్ రేటింగ్, అంతకన్నా ఎక్కువ రేటింగ్ ఉన్న 14 గ్రామీణ ఉన్నత పాఠశాలలు, 6 పట్టణ పాఠశాలలను ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపుతారు.

స్టార్, పాయింట్స్ కేటాయింపు ఇలా..

పాయింట్స్	స్టార్
90-100	5
75-89	4
51-74	3
35-50	2

జాతీయ స్థాయిలో 200 పాఠశాలల ఎంపిక..

జాతీయస్థాయిలో 5 స్టార్ రేటింగ్ కలిగిన 140 గ్రామీణ, 60 పట్టణ ప్రాంతాల పాఠశాలలను ఎంపిక చేస్తారు. జాతీయ స్థాయిలో స్వచ్ఛ హరిత్ విద్యాలయ రేటింగ్స్‌లో ఎంపికైన ప్రతీ పాఠశాలకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేస్తారు.

2014 నుంచి..

దేశంలో 2014లో స్వచ్ఛ భారత్-స్వచ్ఛ విద్యాలయగా (ఎస్‌బీఎస్‌వీ), 2016-2017లో స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌గా (ఎస్‌వీపీ) రికగ్నైజ్డ్ స్కూల్స్‌కు, 2017-2018లో స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలను ప్రభుత్వ యాజమాన్యాలతోపాటు ప్రైవేట్ స్కూళ్లకు కూడా అవకాశం కల్పించారు. 2020-2021లో స్వచ్ఛ విద్యాలయ పురస్కార్-3లో దేశంలో 8.23 లక్షల పాఠశాలలు భాగసాములయ్యాయి. 2025-2026లో నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా స్వచ్ఛ ఎవమ్ హరిత్ విద్యాలయ (ఎస్‌హెచ్‌వీఆర్) మిషన్ లైఫ్ న్యూ కేటగిరీ క్లీన్ అండ్ గ్రీన్ ఇన్ స్కూల్స్ డెవలప్‌మెంట్ పొందుపర్చారు.

రెండు జిల్లాల్లో పాఠశాలల సంఖ్య..

హనుమకొండ జిల్లాలో అన్ని యాజమాన్యాలకు సంబంధించి 880 పాఠశాలలు, వరంగల్ జిల్లాలోఅన్ని యాజమాన్యాలు కలిపి 1,028 పాఠశాలలు ఉన్నాయి. స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయాలుగా తమ వివరాలను పొందుపర్చి ఎన్ని పాఠశాలలు పోటీపడతాయో వేచి చూడాలి.

SHVR

రేటింగ్ పాయింట్స్ ఇలా..

మంచి నీటి వినియోగం 22 పాయింట్స్, మరుగుదొడ్ల నిర్వహణ 27, సబ్బులతో చేతులు కడుక్కోవడం 14, ప్రవర్తన, మార్పు 20, పచ్చదనం పరిశుభ్రత 21, పాఠశాలల్లో పర్యావరణ క్లబ్‌ల ఏర్పాటు, ఎల్ఈడీ బల్బుల వినియోగం, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ, సోలార్ ప్యానల్ ఏర్పాటు వంటి అంశాలకు 21 పాయింట్లు ఉంటాయి. మొత్తం 125 పాయింట్స్ ఉంటాయి. పలు విభాగాల్లో అందులోని అంశాలపై వివరాలను పొందుపరిస్తే వచ్చిన పాయింట్స్ ఆధారంగా పాఠశాలకు స్టార్ రేటింగ్ ఇస్తారు.

యూరియా కోసం రైతుల ఆరాటం



నల్లబెల్లిలో యూరియా బస్తాల కోసం సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రైతులు

నల్లబెల్లి: యూరియా బస్తాల కోసం మండలంలోని నల్లబెల్లి పీఏసీఎస్ సొసైటీ, రాంపూర్ రైతుల వేదికల్లో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే నల్లబెల్లి పీఏసీఎస్, మేడపల్లి రైతు వేదికల్లో యూరియా బస్తాల కోసం రైతులు క్యూలో నిల్చున్నారు. నిర్వాహకులు ప్రతి రైతుకు ఒకటే బస్తా ఇవ్వడంతో రైతులు ఆందోళన చెందారు. క్యూలో నిల్చున్న రైతులకు బస్తాలు అందకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. నల్లబెల్లి, మేడపల్లి పీఏసీఎస్ కేంద్రాల్లో 20 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా పంపిణీ చేశారు. యూరియా అయిపోగానే రైతులు ఒక్కసారిగా సొసైటీలోకి దూసుకొచ్చారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మేడపల్లికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతులతో కలిసి నిరసన చేపట్టారు. రైతులకు పూర్తి స్థాయిలో యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మేడపల్లి, నల్లబెల్లిలో రైతులకు సిబ్బంది టోకన్లు పంపిణీ చేశారు. నల్లబెల్లిలో టోకెన్లు పంపిణీ చేస్తున్న ఎస్సై పైకి రైతులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. ఒకటి రెండు రోజుల్లో వచ్చే యూరియా పంపిణీలో ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా కల్పిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

రుద్రేశ్వరాలయంలో శ్రీమహాలక్ష్మీ యాగం



దేవాలయంలో శ్రీమహాలక్ష్మీ యాగం నిర్వహిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో ఐదో రోజు శ్రీమహాలక్ష్మీ యాగం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు మణికంఠశర్మ, ప్రణవ్, సందీప్‌శర్మ ఉదయం నుంచి స్వామివారికి రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. మూల(ఉత్తిష్ట) మహాగణపతికి ప్రాచీన కోనేరు నీటితో గంగా జలాభిషేకం, నారికేళాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం సర్పగణపతిగా అలంకరించారు. ఉత్సవ గణపతి విగ్రహానికి గణపతి సూక్త మంత్రపఠనంతో షోడశోపచారపూజలు, మహా నైవేద్యం, మహా హారతి జరిగాయి. పంచలోహ ఉత్సవమూర్తిని పద్మవాహనంపై ప్రతిష్ఠించి పల్లకీ సేవ నిర్వహించారు. లోకకల్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో గణపతి రుద్రహోమం, శ్రీమహాలక్ష్మీ హోమం నిర్వహించారు. వొద్దె ప్రకాశ్ దంపతులు, కంజుల మహేశ్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ యువత దార్మికభావాలతో ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు చేశారు. నృత్యగురువు తాడూరి రేణుక శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఆలయ ఈఓ ధరణికోట అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతులను పట్టించుకోని ఎమ్మెల్యే

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం: నియోజకవర్గంలో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే మాధవరెడ్డి కనీసం పట్టించుకోలేని పరిస్థితిలో ఉన్నాడని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియాపై రైతులకు భరోసా కూడా కల్పించకపోవడం బాధాకరం అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న నర్సంపేట నియోజకవర్గంలో యూరియాపై కనీసం సమీక్ష కూడా నిర్వహించని ఏకైక ఎమ్మెల్యేగా మాధవరెడ్డి నిలుస్తారని ఎద్దేవా చేశారు. స్కూల్‌కు వెళ్లే పిల్లలు కూడా యూరియా కోసం క్యూలో నిలుచునే పరిస్థితి వస్తుందంటే ఏ స్థాయిలో యూరియా సమస్య ఉందో తెలుస్తుందన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో 11,600 మంది రైతులకు 26.60కోట్ల బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. యూరియా అందించలేని అసమర్థ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బందారపు శ్రీనివాస్, వల్లెపు శ్రీను, కోరె సుధాకర్, ఉపేందర్‌రెడ్డి, మౌలానా, మస్తాన్, పూలునాయక్, సునీత, వెంకన్న పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షుడు కైలాష్ యాదవ్



ముగింపు వేడుకల్లో రాతికోట వద్ద సత్యవాణి, కైలాష్ యాదవ్, క్రీడాకారులు

ఖిలా వరంగల్: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ యాదవ్, జిల్లా యువజన క్రీడా మండలి అధికారి సత్యవాణి అన్నారు. జాతీయ క్రీడావారోత్సవాల్లో భాగంగా జిల్లా నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యువజన క్రీడా మండలి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు ఆదివారం సాయంత్రం ఖిలా వరంగల్ కోటలో అట్టహాసంగా ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైనవారు సైకిల్‌ర్యాలీ ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన క్రీడా పాలసీని అతి త్వరలో జిల్లాల వారీగా తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్రీడా యూనివర్సిటీలను క్రీడా పాఠశాలలను నిర్వహించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఆనంతరం పలు క్రీడాపోటీల్లో రాణించిన విజేతలకు బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బైరబోయిన ఉమ, మాజీ కార్పొరేటర్ దామోదర్, నెహ్రూ యువ కేంద్రం అన్వేష్, వేమ, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల కోలాహలం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. ఆలయంలోని స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుని పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలు ఇతర ప్రైవేట్ వాహనాల్లో హేమాచలగుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలోని చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయంలోని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు స్వామివారికి తిలతైలాభిషేకం పూజలు నిర్వహించారు. స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని పులకించారు. భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించిన పూజారులు స్వామివారి విశిష్టత, ఆలయ పురాణాన్ని భక్తులకు వివరించారు. సంతానం కోసం స్వామివారి నాభిచందన ప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన దంపతులకు అర్చకులు స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఆక్సిజన్ పార్కు పూర్తయ్యేనా?

2017లో రూ.4 కోట్లతో కుడా శంకుస్థాపన

- 99 ఎకరాల్లో ఏర్పాటుకు అధికారుల ప్రణాళిక
- ఇప్పటివరకు 20 శాతం కూడా పూర్తికాని పనులు



ముళ్ల పొదల్లో ఆక్సిజన్ పార్కు స్థలం




మియావాకీ ఫారెస్ట్‌లో నాటిన మొక్కలు

మడికొండ: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్-స్టేషన్‌పెండ్యాలలో నిర్మించతలపెట్టిన ఆక్సిజన్ పార్కు అటకెక్కింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లో రూ.నాలుగు కోట్లతో పార్కు నిర్మాణానికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు శ్రీకారం చుట్టారు. 99 ఎకరాల్లో 40 ఎకరాలు ఉన్న ఊర చెరువును అభివృద్ధి చేయడంతోపాటు మిగిలిన స్థలంలో మియావాకీ, బ్లాక్ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. పార్కు ఎంట్రెన్స్‌లో గేట్‌వే నిర్మాణంతో పాటు చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్, బటర్‌ఫ్లై పార్కు నిర్మాణం చేయనున్నట్లు అప్పుడు అధికారులు తెలిపారు. చెరువులో బోటింగ్, ఫిషింగ్, యాక్టివిటీ, పాత్ వే నిర్మాణం, ఫుడ్‌కోర్టు, వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కానీ, ఇప్పటివరకు 20 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

ఆక్సిజన్ పార్కులో మియావాకి ఫారెస్ట్ ప్రత్యేకత..

తక్కువ స్థలంలో ఎక్కువగా మొక్కలను పెంచడమే మియావాకీ ప్రత్యేకత. మియావాకీ రాష్ట్రంలోనే తొలిసారి ఇక్కడ ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. పెరుగుతున్న జనాభాకు ఎక్కువ మొత్తంలో ఆక్సిజన్ ఉత్పత్తి చేయడమే ఈ పార్కు ముఖ్య ఉద్దేశం. అరమీటరుకు ఒకటి చొప్పున నాటిన మొక్కలు పెరిగే కొద్ది దట్టమైన అడవిలా మారుతుందని, దీని మధ్యలో ఉండే పాత్‌వేలో నడుచుకుంటూ వెళ్తే అడవిలో నుంచి వెళ్తున్న అనుభూతి కలిగే విధంగా తీర్చిదిద్దనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కానీ, ఆక్సిజన్ పార్కులో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో పర్యాటకులు, నగర ప్రజలకు ఆహ్లాదం కరువైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.


ఆక్సిజన్ పార్కుతోనే గ్రామ అభివృద్ధి



ఆక్సిజన్ పార్కు పూర్తయితే మా గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఎంతో సంతోష పడ్డాం. కానీ, నేడు ఒక్క అడుగు ముందుకు పడని పరిస్థితి నెలకొంది. అసలు పార్కు అభివృద్ధి పనులు చేపడతారా లేదా అనేది తెలియడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆక్సిజన్ పార్కు పూర్తి చేయాలి.

\- అర్శనపల్లి విజయ్‌రావు, స్థానికుడు

పార్కు పూర్తికాలేదు..



అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించింది. 2017లో పనులు ప్రారంభించారు. ఇప్పటివరకూ పార్కు పనులు పూర్తికాలేదు. ఆక్సిజన్ పార్కుపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

\- గడ్డం రాజుగౌడ్, స్థానికుడు

పర్యాటకుల సందడి



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

ఖానాపురం: మండలంలోని పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఆదివారం భారీగా తరలివచ్చారు. పాకాల మత్తడి వద్ద జలకాలాడుతూ యువత ఉత్సాహంగా గడిపారు. బోటింగ్ చేస్తూ పాకాల సందడిని ఆస్వాదించారు.

'దూసపాటిలొద్ది'కి అనుమతి లేదు

వాజేడు: దూసపాటిలొద్ది జలపాతానికి పర్యాటకులకు అనుమతి లేదని ఎఫ్‌బీఓ లలిత తెలిపారు. మండల పరిధిలోని కొంగాల గ్రామ సమీపంలోని గుట్టల వద్ద ఉన్న దూసపాటి లొద్ది జలపాత సందర్శనకు ఆదివారం పలువురు పర్యాటకులు కార్లలో వచ్చారు. ఈ క్రమంలో చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న ఎఫ్‌బీఓ లలిత పర్యాటకులకు లోనికి వెళ్లేందుకు అనుమతి లేదని తిరిగి పంపించారు.

శాంతించిన గోదావరి



సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి

కన్నాయిగూడెం: మూడు రోజుల నుంచి ఉరకలేసిన గోదావరి ఉధృతి ఆదివారం కొంతమేర తగ్గి శాంతించింది. తుపాకులగూడెం సమ్మక్కసాగర్ బ్యారేజీలోకి ఆదివారం వరకు 8,17,183 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. నిన్నటి వరకు 8,57,190 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా ఆదివారం 40 వేల క్యూసెక్కుల మేర ప్రవాహం తగ్గి శాంతించింది. ప్రస్తుతం బ్యారేజీ 59 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 82.90 మీటర్ల నీటి మట్టం ఉంది. ఇన్‌టెక్ వెల్ వద్ద ఫేజ్.2 లో ఒక మోటారును ఆన్ చేసి 247 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు.

ఇంకా నీటిలోనే రహదారులు

వాజేడు: మండల పరిధిలో మూడు రోజుల క్రితం ముంపునకు గురైన రహదారులు ఇంకా నీటిలోనే ఉన్నాయి.

గ్రేటర్ అధికారులకు బాధ్యతల అప్పగింత

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన అధికారుల బదిలీలు, ఉద్యోగ విరమణ నేపథ్యంలో కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. బల్దియా అడిషనల్ కమిషనర్ పనిచేసిన జోనా హనుమకొండ జిల్లా మెప్మా పీడీగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసి నాలుగు నెలల పాటు వెయిటింగ్‌లో ఉన్న చంద్రశేఖర్ బల్దియా అడిషనల్ కమిషనర్‌గా విధుల్లో చేరారు. ఆయనకు బల్దియా పరిపాలన విభాగం పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. హుజూరాబాద్ కమిషనర్‌గా పనిచేసి వెయిటింగ్‌లో ఉన్న ఎస్.సమ్మయ్య బల్దియా డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు.

ఆయనకు బల్దియా సెక్రటరీగా, అడ్మినిస్ట్రేటివ్ విభాగం డిప్యూటీ కమిషనర్‌గా, మెప్మా ఇన్‌చార్జ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు బాధ్యతలు కేటాయించారు. ఇద్దరు ఆర్‌ఓలు ఉద్యోగ విరమణ చేశారు. దీంతో కాశిబుగ్గ సర్కిల్ రెవెన్యూ ఆఫీసర్‌గా శ్రీనివాస్, కాజీపేట సర్కిల్ రెవెన్యూ ఆఫీసర్‌గా షహజాదీ బేగంకు బాధ్యతలు అప్పగించారు.

క్లుప్తంగా

బీటెక్ మూడు, ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీటెక్ మూడు, ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల రివైజ్డ్ టైంటేబుల్‌ను విడుదల చేశారు. బీటెక్ సీబీసీఎస్ ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు సెప్టెంబర్ ఒకటి నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిం ఇక్బాల్ తెలిపారు. 1, 3,6, 9, 11, 15,17 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలవరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే, బీటెక్ మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు సెప్టెంబర్ 2, 4, 8, 10, 12, 16, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని వారు తెలిపారు.

బీటెక్ 8వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు..
బీటెక్ 8వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల సెప్టెంబర్ ఒకటి నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. 1, 3, 6, 9 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

తాపీమేస్త్రీ ఆత్మహత్య

ఖిలా వరంగల్: పిల్లలు లేరనే మనస్తాపంతో తాపీమేస్త్రీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన చిదురాల రామ్మోహన్ (32) తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పిల్లలు కావడం లేదనే మనస్తాపంతో రామ్మోహన్ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం ఉదయం 7 గంటలకు భార్య రచన వంట పనికి వెళ్లి మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటికి వచ్చింది. అప్పటికే ఆయన ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆమె గమనించి చుట్టు పక్కల వారి సాయంతో కిందికి దించి ఎంజీఎం తరలించింది. వైద్యులు పరిశీలించి మృతి చెందాడని చెప్పారు. భార్య రచన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

జల విలయానికి ఏడాది..




పురుషోత్తమాయగూడెం ఆకేరువాగు బ్రిడ్జి వద్ద కొట్టుకుపోయిన 365 జాతీయ రహదారి, బాల్నిధర్మారం శివారు ఆకేరువాగుపై కొట్టుకుపోయిన బ్రిడ్జి (ఫైల్)

గతేడాది అర్ధరాత్రి ముంచెత్తిన వరదలు
- ఆకేరు వాగు వరద నీటిలో చిక్కుకున్న సీతారాంతండా
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇంటి స్లాబ్‌లపైకి ఎక్కిన ప్రజలు
- అనంతరం తండాను సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి
- వరద బాధితులకు ఇచ్చిన హామీ ఏడాదిగా నెరవేరని వైనం

మరిపెడ రూరల్: గతేడాది ఆగస్టు 31 అర్ధరాత్రి, సెప్టెంబర్ 1న తెల్లవారుజామున ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వరదలు ముంచెత్తాయి. ఫలితంగా మండలంలోని చెరువులు, కుంటలన్నీ తెగిపోయి వరద పోటెత్తింది. ఆకేరు వాగు ఉగ్రరూపం దాల్చి పరీవాహక ప్రాంత గ్రామాలు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లెపల్లి, సీతారాంతండా, బాల్నిధర్మారం గ్రామాల్లోకి అర్ధరాత్రి వరద చేరుకుంది. ఆ సమయంలో ప్రజలంతా నిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఇళ్లల్లోకి నీరు చేరడంతో ఏమి జరుగుతుందో అర్థం కానీ పరిస్థితుల్లో అర్థనాదాలు చేశారు. సీతారాంతండా పూర్తిగా జలమయమైంది. దీంతో బతుకు జీవుడా అంటూ ఇళ్లల్లో నుంచి పిల్లాపాపలతో బయటకు పరుగులు తీశారు. ఎటు చూసిన వరదనీరే. దీంతో ఇళ్ల స్లాబ్‌లు ఎక్కి బిక్కుబిక్కుమంటు తెల్లవార్లు పైనే ఉండి ప్రాణాలు రక్షించుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు ప్రత్యేక బృందాలతో ముంపు గ్రామాలకు చేరుకుని వరదల్లో చిక్కుకున్న సీతారాంతండా ప్రజలను రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ముంపు గ్రామాల్లో భారీ నష్టం..
ముంపు గ్రామాల్లో భారీ నష్టం వాటిల్లింది. తిండి గింజల నుంచి దుస్తుల వరకు తడిసి ముద్దయ్యాయి. పంటలన్నీ వరదకు కొట్టుకుపోయాయి. దీంతో ఎటుచూసినా ఇసుక దిబ్బలు తప్ప మరేమీ కనిపించలేదు. బాల్నిధర్మారం–జెల్లెపల్లి గ్రామాల మధ్య ఆకేరు వాగుపై ఉన్న బ్రిడ్జి అరకిలోమీటర్ కొట్టుకుపోయింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద హైవే తెగిపోయి కారు కొట్టుకుపోయింది. దీంతో తండ్రి, కూతురు మృతి చెందారు.

సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం..
అధికారుల లెక్కల ప్రకారం.. సీతారాంతండాలో 49, ఉల్లెపల్లిలో 123, బాల్నిధర్మారంలో 10, తండాధర్మారంలో 10 ఇళ్లు నీట మునిగాయి. అలాగే, ఆకేరు వాగు పరీవాహక ప్రాంతంలో సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. అనంతరం ముంపుకు గురైన సీతారాంతండాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.10 వేలు, పంట నష్టం జరిగిన బాధితులకు రూ.16 వేల చొప్పున పరిహారం అందించారు. వాగు పరీవాహక గ్రామాల్లో ముంపునకు గురైన ఇళ్ల బాధిత కుటుంబాలకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి వారందరికీ ఒకే చోట సామూహికంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని సీఎం ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని బాధితులు కన్నీరుమన్నీరవుతున్నారు.

ఆకేరు వరదతో ఆగం..

- కోలుకోని బాధితులు



వరదకు కొట్టుకుపోయిన ముల్కలపల్లి బ్రిడ్జి(ఫైల్)

డోర్నకల్: ఏడాది క్రితం సెప్టెంబర్ 1వ తేదీన కురిసిన భారీ వర్షంతో డోర్నకల్ సమీపంలోని మున్నేరు వాగుతో పాటు ముల్కలపల్లి సమీపంలోని ఆకేరువాగుకు భారీ వరద పోటెత్తి తీవ్ర నష్టం వాటిల్లింది. సెప్టెంబర్ 1న తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురువడంతో ఆకేరువాగుకు వరద పోటెత్తింది. దీంతో దుబ్బగడ్డతండాలో 45, మోదుగ్గడ్డతండాలో 40, ముల్కలపల్లిలో సుమారు 120 ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ఆకేరు పరీవాహక ప్రాంతంలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వాగు పక్కన నర్సరీలోని 50 లక్షల మిరప మొక్కలు, మెకానిక్ షెడ్డులోని జేసీబీలు, ట్రాక్టర్లు వరదకు కొట్టుకుపోయాయి. డోర్నకల్ సమీపంలో రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో రైళ్లన్నీ డోర్నకల్‌లో రోజంతా నిలిచాయి. మున్నేరువాగు ఉప్పొంగడంతో డోర్నకల్, అమ్మపాలెం, గొల్లచర్ల, వెన్నారం గ్రామాల పరిధిలోని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నాటి వరదను గుర్తు తెచ్చుకుంటున్న స్థానికులు భయంతో వణికిపోతున్నారు.

సర్వం కోల్పోయాం..



గతేడాది ఆకేరు వాగు వరద ధాటికి సర్వం కోల్పోయాం. వారం రోజులుగా ఇళ్లు వదిలేసి పునరావాస కేంద్రంలోనే తలదాచుకున్నాం. ఇప్పటికీ ఆ పీడకల గుర్తుకొస్తే భయంతో వణికిపోతున్నాం.

-మూడు రామన్న, ముంపు బాధితుడు, సీతారాంతండా

కోలుకోలేక పోతున్నాం..



వరదతో సర్వం కోల్పోయిన మేము ఇంకా కోలుకోలేకపోతున్నాం. పొలాల్లో ఇసుక మేటలు పడి పంటలు పండే పరిస్థితి కానరావడం లేదు. ఇంట్లో వస్తువులన్నీ వరదకు కొట్టుకుపోవడంతో ఒక్కొక్కటిగా కొనుగోలు చేసుకుంటున్నాం

-గుగులోత్ మంగీ, ముంపు బాధితురాలు, సీతారాంతండా

వర్షం వస్తే భయం అనిపిస్తోంది..



గతేడాది ఆకేరు వాగు వరదలో చిక్కుకుని బతికి బట్టగట్టా. ప్రస్తుతం వర్షం వస్తే భయంతో వణికి పోవాల్సి వస్తుంది. నా ఇల్లు ఉల్లెపల్లిలో ఆకేరు వాగు ఒడ్డునే ఉంది. ఎప్పుడు వరదలు వచ్చి ప్రాణాలు పోతాయోనని భయంగా ఉంది.

-గండ్లు శాంతమ్మ, ముంపు బాధితురాలు, ఉల్లెపల్లి

నేటినుంచి మూడేళ్ల 'లా' రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల 'లా' కోర్సు రెండో సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు సెప్టెంబర్ 1వ తేదీ(సోమవారం) నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిం ఇక్బాల్ ఆదివారం తెలిపారు.సెప్టెంబర్ 1, 3, 6, 9, 11 తేదీల్లో ఆయా పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వారు తెలిపారు.

6న బీ ఫార్మసీ పరీక్ష

కేయూ క్యాంపస్: భారీ వర్షాలతో ఆగస్టు 28న వాయిదా పడిన కాకతీయ యూనివర్సిటీ బీ ఫార్మసీ(సీబీసీఎస్)నాలుగో సెమిస్టర్ పేపర్– 2 మెడిసినల్ కెమిస్ట్రీ –1 పరీక్షను ఈ నెల 6న నిర్వహించనున్నట్లు పరీక్షల విభాగం అధికారులు ఆదివారం తెలిపారు. విద్యార్థులు పరీక్షకు సన్నద్ధం కావాలన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



బన్నీ మృతదేహం

భూపాలపల్లి రూరల్: ఈతకు వెళ్లి బాలుడు మృతిచెందిన ఘటన ఆదివారం భూపాలపల్లి మండలంలోని దీక్షకుంట గ్రామంలో జరిగింది. మృతుడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన సంగిరెడ్డి కుమారస్వామి– సునీత దంపతులు జీవనోపాధి నిమిత్తం ఆరు నెలల క్రితం దీక్షకుంటకు వచ్చారు. కుమారస్వామి గేదెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. వీరికి కుమార్తె, 8వ తరగతి చదువుతున్న కుమారుడు బన్నీ (14) ఉన్నారు. స్నేహితులు శివమణి, హర్షవర్ధన్‌తో కలిసి బన్నీ ఆదివారం గ్రామంలోని చిన్నకుంటకు ఈతకు వెళ్లాడు. బన్నీ నీటిలో మునిగి కొట్టుమిట్టాడుతుండగా స్నేహితులు గమనించి అరిచారు. గ్రామస్తులు వెళ్లి బన్నీని బయటకు తీసుకొచ్చే సరికి మృతి చెందాడు. తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లోకి మార్చాలి

- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్



మాట్లాడుతున్న బండా ప్రకాశ్

నెహ్రూసెంటర్: ముదిరాజ్ కులస్తులు ఐకమత్యంతో ఉంటూ రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ముదిరాజ్ మహాసభ మహబూబాబాద్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ 42 శాతం రిజర్వేషన్‌లో ముదిరాజ్ కులస్తులకు జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ముదిరాజ్‌లను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ'లోకి మార్చాలన్నారు. ముదిరాజ్ కులస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లుగానే మత్స్యశాఖ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులకు చేప పిల్లలకు బదులు సొసైటీ సభ్యుల ఖాతాలో నగదు జమ చేయాలని కోరారు. జీపీ పరిధిలోని చెరువులను మత్స్యశాఖ పరిధిలోకి తీసుకురావాలని, తెలంగాణ మత్స్యశాఖ ఫెడరేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పల్లెబోయిన అశోక్, గుర్రాల మల్లేశం, పిట్టల వెంకట్రామనర్సయ్య, నీలం దుర్గేశ్, కొత్తూరు రమేశ్, చిల్ల సహదేవ్, గుండెల రాజు, ఎడెల్లి యాకయ్య, అల్వాల సోమయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భీమునిపాదం వద్ద పర్యాటకుల సందడి



జలపాతంలో స్నానం చేస్తున్న పర్యాటకులు

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపం భీమునిపాదం జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. హనుమకొండ, వరంగల్, నర్సంపేట, మానుకోట, ఇతర ప్రాంతాల నుంచి వివిధ వాహనాల ద్వారా జలపాతం చేరుకున్నారు. అనంతరం జలపాతం కింద స్నానం చేస్తూ ఎంజాయ్ చేశారు. సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందడి చేశారు. కాగా, ఎలాంటి ప్రమాదం జరగకుండా ఆర్ఫ్ వద్ద ఫారెస్ట్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఎరుపెక్కుతున్న రైలు పట్టాలు

రైలు ప్రమాదాలకు గురవుతూ చనిపోతున్న పలువురు
- కష్టాలకు చితికి అర్ధంతరంగా తనువు చాలిస్తున్న యువత
- వెరసి ట్రాక్‌పై మోగుతున్న మరణ మృదంగం



ఖిలా వరంగల్/కాజీపేట రూరల్ : రైలు పట్టాలు రక్తధారలతో ఎరుపెక్కుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్‌దాటుతూ ప్రమాదాలకు గురికావడం.. రైలు బోగి నుంచి ప్రమాదవశాత్తు జారి పడడం, కష్టాలకు చితికి పోయి క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడడం లాంటి ఘటనలతో రైలు పట్టాలపై మరణ మృదంగం మోగుతోంది. ఫలితంగా ఆనందంగా సాగుతుందనుకునే రైలు ప్రయాణం పలువురి జీవితాల్లో తీవ్ర విషాదం నింపుతోంది. భద్రత కోసం అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. ప్రయాణంలో నిర్లక్ష్యం, జీవితం మీద విరక్తితో ఆత్మహత్యలకు పాల్పడడం.. ఇలా కారణం ఏమైనా తరచూ రైలు పట్టాలపై మృత్యు ఘోష వినిపిస్తూనే ఉంది. వరంగల్ రైల్వేస్టేషన్ (జీఆర్పీ) పరిధిలో న్యూశాయంపేట రైల్వే గేట్ నుంచి మహబూబాబాద్ వరకు సుమారు 110 కిలోమీటర్ల పరిధిలో రోజూ ఏదో ఒక చోట దుర్ఘటన చోటు చేసుకుంటూనే ఉంది. కాజీపేట జీఆర్పీ స్టేషన్ పరిధి కాజీపేట నుంచి పెంబర్తి, కాజీపేట నుంచి ఉప్పల్, కాజీపేట నుంచి దర్గా రైల్వే గేట్ వరకు ఉంది.

ఎవరితో చెప్పుకోవాలి..
పదేళ్ల క్రితం వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉమ్మడి కుటుంబాలుండేవి. ఏ కష్టం వచ్చినా పంచుకునేందుకు, భరోసా ఇచ్చేందుకు పెద్దలు ఉండేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. కష్టమొస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. ఉరుకులు, పరుగుల జీవితంలో కనీసం భార్య, భర్తలు కుటుంబ పెద్దలతో మనసు విప్పి మాట్లాడుకునే సమయం ఎక్కడుంది. ఒంటరితనంలో మానసికంగా కృంగిపోతుండడంతో ఆత్మహత్యలకు దారి తీస్తోంది.

యువతలో అధికం..
చదువులో ఒత్తిడి.. ప్రేమలో వైఫల్యం.. మత్తుపదార్థాలకు బానిస కావడం.. కుటుంబ కలహాలు.. దీర్ఘకాలిక అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులు.. ఒంటరితనం.. తదితర కారణాలతో యువత ఎక్కువ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జీవితంలో ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఆ వ్యక్తిలోని క్షణికావేశం ఆత్మహత్యకు ప్రేరేపిస్తుంది. వివాహేతర సంబంధాలు కూడా కుటుంబాల్లో గొడవలకు కారణమవుతున్నాయి. వీటి వల్ల మనస్తాపానికి గురై ప్రాణం తీసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతిని విశ్లేషణ శక్తి కొరవడుతోంది. స్నేహితులు, పెద్దల నుంచి సరైన సలహాలు తీసుకోలేకపోవడం వల్ల తనువు చాలిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది యువతే ఉంటున్నారు. 22 నుంచి 25 ఏళ్లలోపు వారు 35 శాతం ఉంటున్నారు. 35 నుంచి 65 ఏళ్ల పైబడిన వారిలో ఈ ధోరణి ఎక్కువ కనిపిస్తోందని మానసిక శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

ఘటనలకు కొన్ని కారణాలు..
కదులుతున్న రైళ్లు ఎక్కడం, దిగడం, వేగంగా వెళ్తున్న రైళ్లోని గేట్ల వద్ద కూర్చుని, నిల్చొని స్వీయ చిత్రాలు, రీల్స్‌కు యత్నించడం, గేట్ల వద్ద కూర్చున్నప్పుడు నిద్రొచ్చి జారిపడపోవడం, రైలు వస్తోందని గమనించకుండా పట్టాలు దాటడం, అనారోగ్య, ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో జీవి తంపై విరక్తి చెంది ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

జీవితం మీద విరక్తితో ..
జీవించి సాధించాల్సింది పోయి కష్టాలతో చితికి.. మానసిక వేదన గురై పలువురు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. వరంగల్ జీఆర్పీ స్టేషన్ పరిధిలో ఆత్మహత్య ఘటనలు ఇటీవల ఎక్కువగా నమోదవుతున్నాయి. కుటుంబాల కలహాలతో క్షణికావేశానికి గురైన వారు కొందరైతే.. ఆర్థిక కష్టాలతో మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడి నమ్ముకున్న వారికి పుట్టెడు శోకం మిగుల్చుతున్నారు.



వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్

కొన్ని ఘటనలు ఇలా..
- వరంగల్ చింతలపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఇటీవల క్రిస్టియన్ కాలనీకి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.
- బట్టల షాపులో పనిచేస్తున్న వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన ఓ గుమస్తా ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది హంటర్ రోడ్డులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

వరంగల్ జీఆర్పీ పరిధిలో..

మృతి రూపకం	2024 మృతులు	2025 మృతులు
యాక్సిడెంట్	33	19
ఆత్మహత్య	40	17
ప్రమాదవశాత్తు	12	8
మొత్తం	85	44

కాజీపేట జీఆర్పీ పరిధిలో..

మృతి రూపకం	2024 మృతులు	2025 మృతులు
యాక్సిడెంట్	23	05
ఆత్మహత్య	40	24
ప్రమాదవశాత్తు	37	20
మొత్తం	100	49

సమస్యలకు చావే పరిష్కారం కాదు..



ఏదైనా సమస్య ఉంటే కుటుంబ సభ్యులతో పంచుకోవాలి. స్నేహితుల సహకారం తీసుకోవాలి. అంతేకానీ ఆత్మహత్యకు పాల్పడొద్దు. ఆత్మహత్యకు ముందు చాలా మంది డిప్రెషన్‌కు లోనవుతారు. ఈసమయంలో ఎవరైనా గుర్తిస్తే ఆత్మహత్య నిర్ణయం నుంచి బయటకొచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి వారికి భరోసా ఇచ్చేలా మాట్లాడాలి. అవసరమైతే వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

డాక్టర్ రాజు, సైకియాట్రిస్ట్, వరంగల్

అవగాహన కల్పిస్తున్నాం..



ఫుట్ బోర్డు ప్రయాణం ప్రమాదమని ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. రైల్వేస్టేషన్‌లో ఎక్కువ సేపు కూర్చుంటున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. రైలు పట్టాలు దాటడం, సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవడానికి జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నాం. అలాగే, సూసైడ్ స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం.

సురేందర్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్, వరంగల్

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలుచోట్ల ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.



జియావుద్దీన్ (ఫైల్)

హసన్‌పర్తి/కమలాపూర్: బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అంబాల–కిట్స్ ప్రధాన రహదారిలోని ఏకశిల పాఠశాల సమీపంలో శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడేనికి చెందిన రాజేందర్ కమలాపూర్‌లో ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపు (లహరి పేరుతో) నిర్వహిస్తున్నాడు. మర్రిపల్లి గూడేనికి చెందిన ఎం.డి జియావుద్దీన్(33) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇద్దరు పని నిమిత్తం బైక్‌పై వరంగల్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఏకశిల పాఠశాల సమీపంలో చేరగానే బైక్ అదుపు తప్పింది. ఈఘటనలో జియావుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. షాపు నిర్వాహకుడు రాజేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.108లో క్షతగాత్రుడిని ఎంజీఎం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద దిక్కు చనిపోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో అదుపు తప్పి మరో యువకుడు..



నరేశ్ (ఫైల్)

మరిపెడ రూరల్: ఆటో అదుపు తప్పి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన చిర్ర నరేశ్ (28) తన అత్తగారి గ్రామం ఖమ్మం జిల్లా సుబ్లేడ్ గ్రామానికి ఆటోలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో మాదిరిపురం సమీపంలో 365 జాతీయ రహదారిపై ఆటో అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, 19 రోజుల కుమారుడు ఉన్నారు. నరేశ్ మృతితో సుబ్లేడు, రాంపురం గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.


102 వాహనం ఢీకొని ఇంకో యువకుడు..



గణేశ్ మృతదేహం

గంగారం : 102 వాహనం ఢీకొనడతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం గంగారం మండలం మడగూడెం మలుపు వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జజ్జరి గణేశ్ (30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై గంగారం నుంచి మడగూడెంలో ఉన్న సోదరి ఇంటికి వెళ్తున్నాడు. మడగూడెం మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న 102 అమ్మఒడి వాహనం ఢీకొనడంతో గణేశ్ కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై రవి కుమార్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడికి భార్య అరుణ ఉంది.

రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని వృద్ధురాలు..



గౌరమ్మ (ఫైల్)

మామునూరు: వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఈ ఘటన తిమ్మాపురం క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన మునుకుంట్ల గౌరమ్మ(62) తిమ్మాపురంలో కొంతమంది ఇళ్లలో పని చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. రోజుమాదిరిగానే ఆదివారం ఉదయం తిమ్మాపురం చేరుకుని పలువురి ఇళ్లలో దుస్తులు ఉతికింది. అనంతరం 11గంటల సమయాన తిరిగి ఇల్లందకు బయలుదేరేందుకు ఖమ్మం జాతీయ రహదారిపై వాయుపుత్ర హోటల్ వద్ద ఆటో కోసం రోడ్డు దాటుతోంది. ఆ సమయంలో వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న వరంగల్ జిల్లా ఖానాపురం మండలం మనుబోతుల గడ్డ తండాకు చెందిన తేజావత్ శ్రీకాంత్ బైక్‌పై అతివేగంగా వెళ్తూ గౌరమ్మను ఢీకొన్నాడు. ఈ ఘటనలో గౌరమ్మ తీవ్రంగా గాయపడగా 108లో ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కూతురు స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.